సాక్షి
మెదక్

ఆదివారం । 22 । జూన్ । 2025

7

ఫల క్షేత్రం..రైతుకు ఊతం

సండే స్పెషల్

సిద్దిపేట జిల్లా ములుగులోని సెంటర్ ఫర్ ఎక్స లెన్స్ ఫర్ ఫ్రూట్స్, తునికిలోని కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు సాగులో అండగా నిలబడుతున్నాయి. ఫల వృక్షాలపై పరిశోధనలు, ఉద్యాన వికాసానికి అవసరమైన వినూత్న సాగు పద్ధతులు, కొత్త వంగడాల రూపకల్పనలోనూ ఎన్నో మెళకువలు అందజేస్తూ రైతులను ముందడుగు వేయిస్తున్నాయి. ఈ రెండు కేంద్రాలపై వారం ఈ సండే స్పెషల్.



8లో

న్యూస్‌రీల్

అర్హులందరికీ రేషన్ బియ్యం పంపిణీ



గోదాంలో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎస్‌ఓ నిత్యానంద

నర్సాపూర్: రేషన్‌కార్డులు కలిగి ఉన్న లబ్ధిదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేయాలని డీఎస్‌ఓ నిత్యానంద ఆదేశించారు. శనివారం పట్టణంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్ గోదాంతో పాటు పలు రేషన్ దుకాణాలను తనిఖీ చేసి బియ్యం నాణ్యత, రికార్డులను పరిశీలించారు. స్టాక్ అయిపోతే తన దృష్టికి తెస్తే బియ్యం సరఫరా చేస్తామన్నారు. నాణ్యతగా లేకపోతే, మార్పు చేయించి నాణ్యమైన బియ్యం అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఆయన వెంట రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, పలువురు డీలర్లు, గోదాం సిబ్బంది ఉన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షణకు ప్రత్యేక బస్సును నడుపుతున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. శనివారం నార్సింగి మండలం శేరిపల్లిలో వారు మాట్లాడుతూ.. ఈనెల 24న సాయంత్రం 6 గంటలకు మెదక్ డిపో నుంచి బస్సు బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, కంచి మీదుగా అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షణ అనంతరం బస్సు తిరిగి మెదక్ బయలుదేరుతుందన్నారు. ఒక్కరికి రూ. 4 వేలు టికెట్ కాగా, హాఫ్ టికెట్ రూ. 2,600 ఉందన్నారు. మెదక్ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒకే గ్రామం నుంచి టీంగా వెళ్లాలనుకునే వారి కోసం ప్రత్యేక బస్సును అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 7382830420, 9494825746 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దరఖాస్తులతో బారులు



క్యూలైన్‌లో రైతులను అదుపు చేస్తున్న పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ముగిసినప్పటికీ శనివారం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు ఇచ్చేందుకు రైతులు భారీగా తరలివచ్చారు. దీంతో పోలీసులు క్యూలైన్ ఏర్పాటు చేశారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ కమలాద్రి, ఉప తహసీల్దార్ షఫీయోద్దీన్, ఆర్ఐ కిషన్ తెలిపారు. శనివారం 188 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు.

రైతు భరోసా రూ. 201 కోట్లు జమ



మెదక్ కలెక్టరేట్: రైతు భరోసా కింద ఇప్పటివరకు జిల్లాలోని 2,53,020 మంది రైతుల ఖాతాల్లో రూ. 201 కోట్లు నేరుగా జమ అయినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం కింద అర్హులైన రైతులకు ఎకరానికి ఏడాదికి రూ. 12,000 పంట పెట్టుబడి సాయం (రెండు విడతల్లో) ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు.



యోగా చేస్తున్న అధికారులు, పట్టణ ప్రజలు



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆరోగ్య యోగం

క్రమం తప్పకుండా యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంత జీవన శైలిని పొందవచ్చని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో యోగాసనాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురాతన కాలం నుంచి యోగాసనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల జిల్లా అధికారులు, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– మెదక్‌జోన్

ట్రాక్ తప్పకుండా..

రైల్వే ప్రభావిత చెరువులకు మరమ్మతులు

- జిల్లాలో 37 చెరువు, కుంటల గుర్తింపు
- కట్టల బలోపేతానికి రూ. 2 కోట్లు విడుదల

రైలు మార్గంలో ట్రాక్‌ను ప్రభావితం చేసే చెరువులు, కుంటల బలోపేతానికి రైల్వే, ఇరిగేషన్ శాఖల అధికారులు శ్రీకారం చుట్టారు. జిల్లాలో ఈ ఏడాది 30 నీటి వనరులకు మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ. 2 కోట్లు మంజూరు కాగా, ముమ్మరంగా మరమ్మతులు చేపడుతున్నారు. ఇప్పటివరకు 27 చెరువు, కుంటల పనులు కొనసాగుతుండగా, మరో 3 నీటి వనరులు టెండర్ దశలో ఉన్నాయి. నిర్మాణాల్లో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ఇరిగేషన్ ఉన్నతాధికారులు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు.

– మెదక్‌జోన్

జిల్లాలోని పలు మండలాల పరిధిలో రైల్వేట్రాక్ పైభాగంలో 37 చెరువులు, కుంటలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వర్షాకాలంలో ఇవి ప్రమాదవశాత్తు తెగిపోతే దిగువ భాగంలో ఉన్న రైల్వేట్రాక్ (పట్టాలు) కొట్టుకుపోయి తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉంటుంది. దీంతో ముందుగానే గుర్తించి తగు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది 37 నీటి వనరులను గుర్తించి, అందులో 30 చెరువు, కుంటల కట్టలను బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ. 2 కోట్లు మంజూరు కాగా, ఇరిగేషన్ అధికారులు టెండర్ పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. 27 చెరువు, కుంటల పనులు కొనసాగుతుండగా, మరో 3 నీటి వనరులు టెండర్ దశలో ఉన్నట్లు సంబంధిత అధికారి ఒకరు చెప్పారు. నిర్మాణాల్లో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ఇరిగేషన్ ఉన్నతాధికారులు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు.



నార్సింగి మండల పరిధిలోని బొడ్డిల్ చెరువు కట్ట మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

మరమ్మతులు చేస్తున్నాం



జిల్లాలో 37 రైల్వే ప్రభావిత ట్యాంకులను గుర్తించాం. అందులో 30 ట్యాంకుల కట్టల బలోపేతానికి రూ. 2 కోట్లు మంజూరు కాగా, 27 నీటి వనరులకు మరమ్మతులు చేస్తున్నాం. అలాగే గతేడాది దెబ్బతిన్న 26 చెరువు, కుంటల పనులు పూర్తి చేశాం.

– శ్రీనివాస్‌రావు, మెదక్ ఇరిగేషన్ ఈఈ

గతేడాది దెబ్బతిన్న చెరువులకు సైతం..

గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు జిల్లావ్యాప్తంగా 27 చెరువు, కుంటలు దెబ్బతిన్నాయి. కాగా అప్పట్లో ఇరిగేషన్ అధికారులు వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో హవేళి ఘణాపూర్ పెద్ద చెరువు తూము దెబ్బతిని, ఆయకట్టు వెనకాల సాగు చేసిన పంటలు కొంతమేర కొట్టుకుపోయాయి. ఆ చెరువులకు సైతం రూ. 40 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేశారు. కలెక్టర్ ఫండ్ నుంచి సైతం రూ. 25 లక్షలు మంజూరయ్యాయి.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కలెక్టర్ రాహుల్‌రాజ్

కొల్చారం(నర్సాపూర్): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం మండలంలోని సంగాయిపేటలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. కొందరు తమ పేరు జాబితాలో వచ్చినప్పటికీ మంజూరు పత్రాలు ఇవ్వలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సాంకేతిక కారణాల వల్ల ఇబ్బంది ఏర్పడిందని, సర్వే జరిపి నిజమైన అర్హులందరికీ మంజూరు పత్రాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం విడతల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు జమ చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణ పనుల సమయంలో లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు పనిచేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. బడి బయట ఉన్న వారు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఫీక్ ఉన్నిసా, ఎంపీడీఓ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి సదాశివుడు, హెచ్ఎం దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కలెక్టర్

8,229 దరఖాస్తులు

ఆర్డీఓ జయచంద్రారెడ్డి



తూప్రాన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు శనివారంతో ముగిసినట్లు ఆర్డీఓ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లో భూ సమస్యలపై 8,229 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇందులో మిస్సింగ్ సర్వే నంబర్లు, విస్తీర్ణం, పేరు సవరణ, పెండింగ్ మ్యుటేషన్, ఫౌతి (విరాసత్), డిజిటల్ సంతకం పెండింగ్, సాదాబైనామా, పీఓటీ, కుటుంబ తగాదాలతో పాటు ఇతర భూ సమస్యలకు దరఖాస్తులు వచ్చాయని వివరించారు. వాటిని పరిశీలించి భూ సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. సాదాబైనామా, పీఓటీ దరఖాస్తులను ప్రభుత్వం ఇచ్చే సూచనల మేరకు పరిష్కరిస్తామన్నారు. దరఖాస్తుదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులు, గ్రామ ప్రజల సహకారంతోనే రెవెన్యూ సదస్సులు సజావుగా, ప్రశాంతంగా ముగిసినట్లు తెలిపారు.

‘కూత’ వేటు దూరంలో..

- తుది దశకు కొమురవెల్లి రైల్వే స్టేషన్ పనులు
- దసరాకు ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటన



కొమురవెల్లి రైల్వేస్టేషన్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం ఎప్పుడు ఎప్పుడాని ఎదురు చూస్తున్న భక్తులకు త్వరలోనే అందుబాటులోకి రానుంది. ప్రతి యేటా మల్లన్న స్వామిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ నుంచి భక్తులు వస్తుంటారు. కొత్తపల్లి నుంచి మనోహరాబాద్ వరకు నూతనంగా నిర్మాణం చేపడుతున్న రైల్వే లైన్లో కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ వద్ద రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలని చాలా కాలంగా డిమాండ్ ఉంది. దీంతో రైల్వేశాఖ స్పందించి స్టేషన్ మంజూరు చేయగా.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్‌తో కలసి 2024 ఫిబ్రవరి 15న భూమి పూజచేసి పనులను ప్రారంభించారు. స్టేషన్, ప్లాట్‌ఫాం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. దసరాకు కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభిస్తామని ఇటీవల కిషన్‌రెడ్డి ప్రకటించారు.

ప్రధాని మోదీ రైతు పక్షపాతి

కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

మెదక్‌జోన్: ప్రధాని నరేంద్ర మోదీ రైతు పక్షపాతి అని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ పగ్గాలు చేపట్టిన తర్వాత క్వింటాల్ ధాన్యానికి రూ. 2,300 మద్దతు ధర వస్తుందన్నారు. అంతకుముందు కేవలం రూ. 1,300 మాత్రమే లభించేదన్నారు. పెట్టుబడి సాయం కోసం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఒక్కో రైతుకు ఏడాదికి రూ. 6 వేల చొప్పున ఖాతాల్లో జమచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో నేటికీ 20 శాతం మంది రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ కాలేదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటుతుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్, మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు అంజయ్య, వెంకట్‌రెడ్డి, ఎంఎల్ఎన్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

‘ఈ–పాస్’తోనే ఎరువుల విక్రయాలు



ఈ- పాస్ మిషన్లు పంపిణీ చేస్తున్న డీఏఓ వినయ్

జిల్లా వ్యవసాయాధికారి వినయ్

మెదక్‌మున్సిపాలిటీ: ఫర్టిలైజర్ దుకాణదారులంతా ఈ–పాస్ యంత్రాల ద్వారానే ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి వినయ్ సూచించారు. శనివారం మెదక్ రైతు వేదికలో ఇండియన్ పొటాష్ లిమిటెడ్ కంపెనీ నిర్వాహకులు సుమారు 150 ఫర్టిలైజర్ షాపు యజమానులకు ఉచితంగా ఈ–పాస్ యంత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువుల విక్రయాల్లో పారదర్శకత పాటించేందుకు 2018 నుంచి మిషన్లను వినియోగంలోకి తెచ్చినట్లు తెలిపారు. ఈపద్ధతితో ఎరువులు నేరుగా రైతుకు చేరుతాయన్నారు. బ్లాక్ దందాకు చెక్ పెట్టవచ్చన్నారు. ఐపీఎల్ డిప్యూటీ మేనేజర్ మురళి మాట్లాడుతూ.. ప్రభుత్వ సబ్సిడీలను రైతులకు అందించాలన్న లక్ష్యంతో ఈ–పాస్ విధానాన్ని ప్రోత్సహించేలా తమ కంపెనీ, ఉచితంగా మిషన్లు పంపిణీ చేసిందన్నారు. మెదక్, రామాయంపేట డివిజన్లలోని సుమారు 150 షాపులకు అందచేశామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ విజయనిర్మల, టెక్నికల్ ఫర్టిలైజర్ అధికారి హర్ష, మండల వ్యవసాయ అధికారులు నాగమాధురి, బాల్‌రెడ్డి, హరిప్రసాద్, శ్రీనివాస్, రామలింగారెడ్డి, రాజ్‌నారాయణ, ఫర్టిలైజర్ షాపు యజమానులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని 33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ దినకర్ తెలిపారు. చిన్నశంకరంపేట, రుద్రారం, చందంపేట, పరిశ్రమల ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అధిక మోతాదుకు చెల్లు

ఖేడ్‌లో మట్టి పరీక్ష కేంద్రం ఏర్పాటు

- ఉమ్మడి జిల్లాలో రెండో కేంద్రం
- ఉమ్మడి మెదక్ జిల్లా రైతులకు ప్రయోజనం

నారాయణఖేడ్: ఎరువులు, రసాయన మందుల విచ్చలవిడి వాడకం ద్వారా నష్టపోతున్న రైతన్నలకు ఉపయోగపడేలా ఉమ్మడి జిల్లాకు మరో మట్టి నమూనా కేంద్రం మజూరైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోనే మట్టి నమూనా పరీక్షా కేంద్రం కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలోని ఏ ప్రాంతం రైతులైనా తమ మట్టి నమూనాలను ఇక్కడే పరీక్షించుకోవాల్సి వస్తుంది. కాగా, ప్రభుత్వం తాజాగా నారాయణఖేడ్‌కు మట్టి పరీక్షా కేంద్రాన్ని మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకుగాను రూ.1.95కోట్లను విడుదల చేసింది. రూ.1కోటి ద్వారా భవన నిర్మాణం పనులు చేపట్టగా, రూ.95లక్షలతో పరికరాలు, గాజు సామగ్రి, రసాయనాలు, ఫర్నీచర్, మౌలిక సదుపాయాలు, ఇతర వస్తువుల కొనుగోలుకు వినియోగించనున్నారు. ఈ కేంద్రం పరిధిలో జిల్లాతోపాటు మెదక్ జిల్లా పరిధిలోని మండలాల రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఖేడ్, అందోల్, జహీరాబాద్ నియోజకవర్గాలతో పాటు, మెదక్ జిల్లాలోని పెద్దశంకరంపేట, రేగోడ్, టేక్మాల్ తదితర మండలాల రైతులకు అనువుగా ఉండనుంది. ఖేడ్ పట్టణ శివారులోని జూకల్ శివారులో స్థలాన్ని ఇదివరకే ఎంపిక చేసి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఆ స్థలంలో భవన నిర్మాణం పనులు చేపట్టనున్నారు. ఈ కేంద్రంలో ఒక ఏడీఏ, ఏవో, ఏఈవోలు, ల్యాబ్ టెక్నీషియన్స్‌ను నియమించనున్నారు.



నారాయణఖేడ్: మట్టి పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

భారీగా ఎరువుల వినియోగం

రాష్ట్రంలో భారీ స్థాయిలో ఎరువుల వినియోగం జరుగుతుందని, ప్రధానంగా యూరియా వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎరువుల, రసాయనాల మంత్రిత్వ శాఖ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి సూచన చేసింది. యూరియా వినియోగం ఎక్కువవుతోందని, దాని ప్రభావం సాగు భూములపై చూపుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. పంజాబ్ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రసాయన ఎరువులు, క్రిమిసంహారక పురుగు మందుల వినియోగం మోతాదుకు మించి ఉందని వెల్లడించింది. మట్టి పరీక్షల ద్వారా ఈ సమస్యలను అధిగమించే అవకాశం ఉంది.

ఇవీ ప్రయోజనాలు..

మట్టి పరీక్ష అనేది మట్టిలోని పోషక పదార్థాల స్థాయిలు, పీహెచ్ విలువ, ఉప్పు సమతుల్యత, సూక్ష్మపదార్థాల ఉనికి తెలుసుకోవడం వ్యవసాయంలో చాలా కీలకమైన అంశం. మట్టి పరీక్ష పంటకు సరిపోయే ఎరువుల ఎంపికకు సహాయ పడుతుంది. మట్టిలో పోషకాలు ఎక్కువగా ఉన్నాయా, ఏవి కొరతగా ఉన్నాయో తెలుసుకుని అందుకు అవసరమైన ఎరువులను సరిగ్గా వినియోగించుకునే వీలుంది. అనవసర ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చు. ఫలితంగా అవసరానికి మించి ఎరువుల వాడకం వల్ల కలిగే హానిని నివారించుకునే వీలుంది. సమతుల్య పోషకాలనిచ్చిన వల్ల పంట ఆరోగ్యంగా పెరిగి దిగుబడి వస్తుంది. అవసరమైన వాటినే వినియోగించడం వల్ల ఖర్చు తగ్గుతుంది. మట్టిలో మార్పులను గమనించి భవిష్యత్తులో తగిన పంటలు వేసే అవకాశం కలుగుతుంది. అధిక రసాయనాల వాడకాన్ని నియంత్రించి నేల, నీటి, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చు. కొత్త భూమిలో పంట సాగు ప్రారంభించే ముందు, ప్రతీ రెండు మూడేళ్లకు ఒకసారి, పంట దిగుబడులు తగ్గిన సందర్భాలు, భూమి మార్పు జరిగిన సందర్భాల్లో మట్టి నమూనా పరీక్షలు నిర్వహించుకోవాలి.



బోనాలతో గిరిజన మహిళలు

బోనాల వైభవం

మండలంలోని కొత్తచెరువు తండాలో జగదాంబదేవి, సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయ నాల్గవ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం గిరిజనులు దేవతామూర్తులకు ఘనంగా బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు.

– కౌడిపల్లి(నర్సాపూర్)



సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

వ్రత శోభితం

చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దంపతులు సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు.

– శివ్వంపేట(నర్సాపూర్)

క్లుప్తంగా

ఢిల్లీ సెమినార్‌కు ఉపాధ్యాయుడు ఎంపిక



సెమినార్‌కు ఎంపికైన ధ్రువపత్రాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయుడు రవీందర్

చేర్యాల(సిద్దిపేట): ఈ నెల 24, 25వ తేదీల్లో కేంద్ర ప్రభుత్వ వినియోగదారులు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో ఢిల్లీలో అడ్వాన్స్‌డ్ శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాల సెమినార్ నిర్వహించనున్నారు. ఈ సెమినార్‌కు మెంటర్‌గా మండలంలోని ఆకునూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాస రవీందర్ ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి 10 మంది ఎంపికవగా అందులో చేర్యాల ప్రాంతానికి చెందిన రవీందర్ ఒకరు. ఈ అరుదైన గౌరవం ఆయనకు దక్కడం పట్ల పాఠశాల హెచ్‌ఎం ఎం.ఐలయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ సైదా బేగం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడిని అభినందించారు.

స్కూల్ బస్సు సీజ్



అధికారులు సీజ్ చేసిన బస్సు

నిజాంపేట(మెదక్): ఫిట్‌నెస్ లేని కారణంగా నిజాంపేట మండల కేంద్రంలోని శ్రీశంకర స్కూల్‌కు చెందిన బస్సును ఆర్టీఏ అధికారులు సీజ్ చేశారు. స్కూల్ బస్సులు కండీషన్‌తో పాటు అన్ని ధ్రువ పత్రాలు ఉండాలని వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సూచించారు. బస్సుతోపాటు ఆటోను కూడా సీజ్ చేశారు. ఈ మేరకు సీజ్ చేసిన వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విధులకు ఆటంకం.. కేసు నమోదు

హవేళీఘణాపూర్(మెదక్): విధి నిర్వహణలో భాగంగా తనిఖీలు చేస్తున్న పోలీసులపై దుర్భాషలాడిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు మెదక్ రూరల్ ఎస్‌ఐ దయానంద్ శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి మెదక్ మండల పరిధిలోని మంభోజిపల్లి వద్ద డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా మాచవరం గ్రామానికి చెందిన కట్ట యాదగిరి, టేక్మాల్ కుమార్ మద్యం తాగి వాహనం నడుపుతుండటంతో పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగినట్లు తేలడంతో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మాచవరం గ్రామానికి చెందిన యాదగిరి, శేఖర్‌లతోపాటు, కొందరు పోలీసు సిబ్బంది వాహనం తాళాలు లాక్కొని, మీ సంగతి చెబుతామంటూ సిబ్బందిపై దాడి చేశారు. ఈ ఘటనలో పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొల్చారం(నర్సాపూర్): తొమ్మిది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వరిగుంతం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఓనమాల నాగభూషణం(33) కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 12న తన టీవీఎస్ ఎక్సెల్‌పై మెదక్ నుంచి వస్తున్నాడు.అప్పాజీపల్లి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ నాగభూషణం ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది.దీంతో తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో, చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేస్తు దర్యాప్తు చేస్తున్నారు.

మూర్ఛ వ్యాధితో..

పటాన్‌చెరు టౌన్: మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఇస్నాపూర్‌కు చెందిన నవీన్ (25) కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. అయితే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న నవీన్ శుక్రవారం నైట్ డ్యూటీకి వెళ్తున్నానని చెప్పాడు. శనివారం ఇస్నాపూర్ వాక్ ఓవర్ బ్రిడ్జి సమీపంలో రామ్ రాజ్ షాపింగ్ మాల్ ముందు మృతి చెంది కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. అనారోగ్యం కారణంగా తమ కుమారుడు మృతి చెంది ఉండవచ్చని, మృతుడు తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

సిద్దిపేటఅర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిద్దిపేట త్రీటౌన్ పోలీసుల వివరాల ప్రకారం ... సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామానికి చెందిన గంగాధరి గణేష్ (17) తన ఇద్దరు స్నేహితులతో కలిసి ఈ నెల 11న ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి సిద్దిపేటకు వస్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వెంటనే వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన గణేష్‌ను హైదరాబాద్ నిమ్స్‌కు తరలించగా బ్రెయిన్ డెడ్ అయి చికిత్సకు సహకరించకపోవడంతో 16వ తేదీన సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

ఫల క్షేత్రం.. రైతుకు ఊతం

సండే స్పెషల్



ములుగులోని సీఓఈ కార్యాలయం

ఉద్యాన వికాసానికి బాటలు వేస్తున్న 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఫ్రూట్స్'

- నర్సరీల్లో పలు ఫలజాతి మొక్కలు
- అవసరమైన రైతులకు పంపిణీ
- నేలల అనుకూలతను బట్టి నాటుకోవచ్చు

ఫల వృక్షాల పరిశోధనకు, రైతులకు నాణ్యమైన మొక్కలు అందించడం ద్వారా ఉద్యాన వికాసానికి సిద్దిపేట జిల్లా ములుగు 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఫ్రూట్స్' బాటలు వేస్తోంది. ఇక్కడ 53 ఎకరాల్లో ఆధునిక సాగు పద్ధతులు నిరంతర శాస్త్రవేత్తల పరిశోధనలు ఉద్యాన అధికారుల పర్యవేక్షణలో ఫలజాతి తదితర మొక్కల నర్సరీతో భాసిల్లుతున్నది. వృద్ధి చేస్తున్న మామిడి, జామ, నిమ్మ, కొబ్బరి రకాల మొక్కలకు డిమాండ్ ఉన్నది. సాగు రకాలు, దిగుబడి తదితర వివరాలను సీఓఈ అధికారి ఆశీష్ వివరించారు.

- కె. కృపాకర్ రెడ్డి, ములుగు(గజ్వేల్):

పోషకాల జామ

గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా లభించే పోషక ఫలం. ఇందులో అలహాబాద్ సఫేదా, లక్నో 49 రకాలున్నాయి. ఎప్పుడైనా నాటుకోవచ్చు. ఎకరంలో 250 మొక్కలు నాటవచ్చు. సంవత్సరానికి 15 నుంచి 20 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

నిమ్మ.. ఔషధ గని

ప్రతి నిత్యం ఆహార పదార్థాల్లో వినియోగించుకునే ఫలం. ఇందులో పెట్లూరి సెలక్షన్-1, బాలాజీ నిమ్మజాతి రకాలున్నాయి. ఏప్రిల్, మేలో కాకుండా ఎప్పుడైనా నాటుకోవచ్చు. నీరు ఆగని నేలల్లో నాటుకోవాలి. ఎకరానికి 111 మొక్కలు వేసుకోవాలి. ఒక చెట్టుకు 700 నుంచి 750 కిలోల దిగుబడి వస్తుంది. గజ్జి తెగులు సోకుతుంది, నివారణకు చర్యలుంటాయి.

కొబ్బరి కోనసీమను మరిపించేలా

కొబ్బరి తోటలు కోనసీమలో సాగు చేస్తుంటారు. తెలంగాణలో సైతం వీటిని ప్రోత్సహించేలా ములుగు సీఓఈలో చౌగాట్ ఆరేంజ్ డ్వార్ఫ్ పొట్టి రకాలు, ఎల్లో పొట్టి కొబ్బరి రకాలను నర్సరీల్లో పెంచుతున్నారు. ఎకరానికి 100 మొక్కలు నాటుకోవచ్చు. వర్షాకాలంలో నాటడంతో పాటు ఏ నేలలైనా అనుకూలం. ఒక చెట్టుకు 150 వరకు కాయల దిగుబడి వస్తుంది. నీరు తప్పని సరిగా ఉండాలి.



కొబ్బరి మొక్కలు

ఫలరాజు.. మామిడి

ఫలరాజుగా మామిడి ప్రసిద్ధి గాంచింది. కేసరి, హిమాయత్, దసేరి, బంగినపల్లి మామిడి మొక్కలను నర్సరీలో పెంచుతున్నారు. ఎర్ర నేల, నీరు నిల్వని నేలలు సాగుకు అనుకూలం. ఎకరంలో 160 మొక్కలు నాటవచ్చు. మూడేళ్ల తరువాత కోత మొదలవుతుంది. కేసరి రకం ఎకరానికి 8 నుంచి 9 టన్నులు, హిమాయత్ 4 నుంచి 5 టన్నులు, దసేరి 6 నుంచి 8 టన్నులు, బంగినపల్లి 6 నుంచి 8 టన్నుల దిగుబడి వస్తుంది.



పంపిణీకి సిద్ధంగా ఉన్న మామిడి మొక్కలు

అందుబాటులో మొక్కలు

వివిధ రకాల ఉద్యాన మొక్కలను సీఓఈ ద్వారా పెంచుతున్నాం. వీటిని అవసరమైన రైతులకు అందజేస్తున్నాం. మామిడి, జామ, నిమ్మ, కొబ్బరి మొక్కలు ఉన్నాయి. రైతులు ములుగు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి సహకారం కోసం అసిస్టెంట్ డైరెక్టర్ 89777 14250 లేదా ఉద్యానశాఖ అధికారి 90001 36490 నంబర్ల ద్వారా సంప్రదించవచ్చు.

– ఆశీష్, ఉద్యాన శాఖ అధికారి

వరిలో విత్తనాల ఎంపికే కీలకం

రైతులు దిగుబడినిచ్చేవే విత్తుకోవాలి

వరి సాగులో నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకుని విత్తుకోవడం మేలని మండలంలోని తునికి కేవీకే (కృషి విజ్ఞాన కేంద్రం) శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇటీవలి కాలంలో పలు రకాల వరి విత్తనాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. అధిక దిగుబడులు, తెగులు, చీడ పీడలను తట్టుకునే రకాల్లో సన్న, దొడ్డు రకం వరి విత్తనాల గురించి రైతుల కోసం..

బొడ్డు పెంటయ్య, కౌడిపల్లి(నర్సాపూర్):



తునికి కేవీకేలో రైతులకు కేఎన్ఎం 1638 వరి విత్తనాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

కేఎన్ఎం 1638 వరి (సన్నరకం)

పంట కాలం: వానాకాలంలో 120 నుంచి 125 రోజులు, యాసంగిలో 130 నుంచి 135 రోజులు
దిగుబడి ఎకరానికి 28 నుంచి 30 క్వింటాళ్లు
ప్రత్యేకతలు : ఉల్లికోడు బయోటైప్ 3, అగ్గి తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుంది. అన్నం రుచిగా, నాణ్యతగా ఉంటుంది.
తునికి కేవీకేలో ఈ యాసంగి సీజన్‌లో సన్నరకం ఈ రకం విత్తనాన్ని సాగు చేశారు. 200 బస్తాల విత్తనాలను రైతులకు విక్రయించారు.

కూనారం సన్నలు (కేఎన్ఎం118) దొడ్డు రకం

వానాకాలం, యాసంగి సీజన్‌కు అనుకూలం
పంటకాలం: వానాకాలం 118 నుంచి 120 రోజులు
యాసంగి 120 నుంచి 125 రోజులు
దిగుబడి ఎకరాకు 28 నుంచి 32 క్వింటాళ్లు
ప్రత్యేకతలు: అగ్గితెగులు, మెడ విరుపు కొంత వరకు తట్టుకుంటుంది. పంట నేలపై పడిపోదు.

ఆర్ఎన్ఆర్ 28361

రాజేంద్రనగర్ ఆర్ఎన్ఆర్ 28361 దొడ్డు రకం వరి విత్తనం
వానాకాలంలో సాగుకు అనుకూలం
పంట కాలం: 130 రోజులు, మధ్యకాలిక రకం,
దిగుబడి ఎకరాకు 30 నుంచి 32 క్వింటాళ్లు
ప్రత్యేకతలు: సుడిదోమ, మెడ విరుపు తెగులు, బ్యాక్టీరియా ఎండుటాకు తెగులు, పొట్ట కుళ్లు తెగులును మధ్యస్థంగా తట్టుకుంటుంది. విత్తన నిద్రావస్థ మూడు వారాలు ఉంటుంది.

విత్తన శుద్ధి తప్పనిసరి



రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు నాణ్యమైన విత్తనాలు, తెగులు, చీడపీడలను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవాలి. వానాకాలం, యాసంగి సీజన్‌కు తగినట్లుగా నీటి ఎద్దడి, ఎండ తీవ్రతను తట్టుకునే రకాలను ఎంచుకోవడం మంచిది. సాగులో సమస్యలుంటే వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలతో ఎరువులు, విత్తనాలు వాడాలి. విత్తన శుద్ధి తప్పని సరిగా చేయాలి. మోతాదుకు మంచి ఎరువులు, పురుగుల మందులు వాడొద్దు.

– ప్రతాప్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్త, తునికి

తెలంగాణ సోన, ఆర్ఎన్ఆర్ 15048 సన్న రకం

పంట కాలం: వానాకాలం 125 రోజులు, యాసంగి 135 రోజులు
దిగుబడి ఎకరాకు 26 నుంచి 28 క్వింటాళ్లు
ప్రత్యేకతలు: అగ్గి తెగులు తట్టుకుంటుంది. పొట్టకుళ్లు తెగులు కొంతవరకు తట్టుకుంటుంది. నత్రజని ఎక్కువగా వినియోగించవద్దు. ఈ సన్న రకం వరిని రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు

డ్రైవర్ మృతి



దుర్గాప్రసాద్



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

దుబ్బాకటౌన్: శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండల కేంద్రానికి చెందిన కుంట దుర్గాప్రసాద్ (36) హైదరాబాద్‌లో కార్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తమ్ముడి ఇంట్లో శుభకార్యం ఉండటంతో ఇక్కడికి వచ్చాడు. శనివారం ఉదయం రాయపోల్ నుంచి సిద్దిపేట మీదుగా హైదరాబాద్ బయలుదేరాడు. మంతూర్ గ్రామ సమీపంలో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో దుర్గాప్రసాద్ మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్‌ఐ రఘుపతి తెలిపారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



ఫరియా సుల్తానా

నర్సాపూర్ రూరల్: ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైంది. ఈ ఘటన నర్సాపూర్ పట్టణంలో జరిగింది. ఎస్సై లింగం కథనం మేరకు... పట్టణంలోని కాజీగల్లికి చెందిన ఆటో డ్రైవర్ ఎండీ.జావిద్ అలీ రెండో కూతురు ఫరియా సుల్తానా (19) ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. ఈనెల 19న వేకువ జాము నుంచి కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలతో పాటు స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. శనివారం జావిద్ అలీ ఖాజీగల్లీకి చెందిన ఎండీ ఫయాజ్ తన కూతురిని కిడ్నాప్ చేశాడని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నా భూమిలో సబ్‌స్టేషన్ నిర్మించొద్దు

- లేదంటే ఆత్మహత్య చేసుకుంటా
- భూ బాధితుడు లాజర్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ శివారులో గల సర్వే నం.2లో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం విద్యుత్ శాఖ అధికారులు ముగ్గు పోసిన విషయం విధితమే. కాగా ఆ భూమి తనదని, ఎన్నో ఏళ్లుగా తన పేరు మీదే ఉందని గ్రామానికి చెందిన పుల్కంటి లాజర్ పేర్కొన్నాడు. శనివారం లాజర్ అధికారులు పోసిన ముగ్గును దున్నేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నం.2లో గల లావుణి పట్టా ఎకరన్నర భూమి తన పేరు మీదే ఉందని, దానికి సంబంధించిన పట్టాబుక్కులు సైతం ఉన్నాయన్నారు. అధికారులు సబ్‌స్టేషన్ నిర్మాణానికి ముగ్గు పోయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఆ భూమిలో నిర్మాణం చేపడితే, బదులుగా మరో చోట భూమి ఇవ్వాలని డిమాండ్ చేశాడు. సర్వే నం.2లో చాలావరకు లావుణి పట్టాలు ఉన్నాయని, వారందరివి కాదని, తన భూమిలోనే ముగ్గు పోయడం సరైంది కాదన్నారు. ఈ విషయమై రెవెన్యూ కార్యాలయంలో సైతం వినతిపత్రం ఇచ్చానన్నారు. ఆ భూమి విషయంలో నాకు అన్యాయం జరిగితే ఆత్మహత్య చేసుకుంటానన్నారు.



చండూర్‌లో ఉన్న తన భూమి పట్టాబుక్కులు చూపుతున్న లాజర్ కుటుంబసభ్యులు

నిత్యం భర్త గొడవ పడుతున్నాడని..

భార్య ఆత్మహత్య



ఖాతూన్

జిన్నారం (పటాన్‌చెరు): భర్త తరచూ తనతో గొడవ పడుతున్నాడని భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి వివరాల ప్రకారం... బీహార్‌కు చెందిన సద్దాం అంసారి, భార్య అమన్ ఖాతూన్ ముగ్గురు పిల్లలతో కలిసి గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్‌లో నివాసముంటున్నారు. తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం కూడా మళ్లీ గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన కాటున్ (24) భర్త, ముగ్గురి పిల్లలు ఇంట్లో ఉండగా బయటి నుంచి తలుపులు పెట్టింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో కొద్ది దూరంలో ఉన్న ఆమె తల్లిదండ్రుల ఇంట్లో చున్నీతో ఉరివేసుకుంది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెట్టుకు ఉరి వేసుకుని..

పటాన్‌చెరు టౌన్: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామానికి చెందిన మల్లేశం(41) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో 19వ తేదీన ఇంట్లో గొడవ పడి, 20వ తేదీన పనికి వెళ్తున్నానని వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు మల్లేశం కోసం వెతుకుతుండగా ఇస్నాపూర్ శివారులోని సూర్యవంశం వెంచర్‌లో చెట్టుకి ఉరి వేసుకుని కనిపించాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి యువకుడు..



శ్రీకాంత్

మద్దూరు(హుస్నాబాద్): పురుగుల మందు తాగి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన చేర్యాల మండలంలోని అర్జున్‌పట్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తాళ్లపల్లి శ్రీకాంత్(26) కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఈనెల 19న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

స్వచ్ఛ బడి బహు బాగు



సిద్దిపేటలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

సిద్దిపేటజోన్: మున్సిపల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్వచ్ఛ బడి బాగుందని ప్రతినిధులు కితాబిచ్చారు. శనివారం వివిధ రాష్ట్రాల ప్రతినిధులు సిద్దిపేట పట్టణంలో పర్యటించారు. స్వచ్ఛ బడిలో తడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ, డంప్ యార్డు, బయో గ్యాస్, స్లాటర్ హౌస్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వాటి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కేరళ, తెలంగాణ, మధ్యప్రదేశ్ అధికారులు, ఉమ్మడి మెదక్ జిల్లా నారాయణ ఖేడ్ మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పాల్గొన్నారు.

బాల్యంపై పుస్తకాల భారం

విద్యార్థులకు పెరుగుతున్న బ్యాగుల మోత

- నిర్దేశించిన పుస్తకాలు కొనాల్సిందేనని ఒత్తిడి
- వయసుకు మించిన బరువు ఎదుగుదలకే ఆటంకం
- ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం



జిల్లాలో మొత్తం

ప్రైవేటు పాఠశాలలు	105
ప్రైవేటు విద్యార్థులు	40,584

తూప్రాన్: బాల్యంపై పుస్తకాల భారం పడుతుంది. శక్తికి మించిన బరువును మోయలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు విద్యా సంస్థలు లెక్కలేని పుస్తకాల బరువు మోపి ఆదాయం దండుకుంటుంటే, చిన్నారులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. లేలేత భుజాన బస్తాలు మోసినట్లు పుస్తకాల బ్యాగులను మోస్తూ కార్పొరేట్ స్కూళ్లలో నాలుగైదు అంతస్తులు మెట్లు ఎక్కేందుకు ఆపసోపాలు పడుతున్నారు. వయసుకు మించిన బరువు మోస్తే వారి వెన్నెముక దెబ్బతినే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఉదయాన్నే పుస్తకాల బ్యాగును భుజాన వేసుకొని లంచ్‌బాక్స్ చేత పట్టుకొని పాఠశాలకు హుషారుగా వెళ్లే పిల్లలు సాయంత్రమయ్యేసరికి నీరసంగా ఇంటికి వస్తున్నారు. ప్రతి విద్యార్థి తన బరువులో ఎనిమిదో వంతు బరువు మోయాలని వైద్యులు చెబుతున్నారు. కానీ విద్యార్థులు తన బరువుకంటే 15నుంచి 20శాతం అధికంగా మోస్తున్నారు. ఐదేళ్ల నుంచి 16 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలు అధిక బరువు మోయరాదని ప్రభుత్వ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. సొంత సెలబస్, స్మార్ట్ క్లాసులు, రివిజనల్ టెస్టుల పేరుతో అధిక పుస్తకాలను విద్యార్థులకు అంటకడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు విధిగా సర్కారు ముద్రించిన పాఠ్య పుస్తకాలతోనే విద్యార్థులకు బోధన చేయాలని సూచిస్తున్నాయి.

అనవసరమైన పుస్తకాలే ఎక్కువ

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరు సబ్జెక్టులకు ఆరు పాఠ్య, నోట్ పుస్తకాలు, మరో నాలుగు పుస్తకాలు ఉంటాయి. కానీ ప్రైవేటు పాఠశాలల్లో ఇందుకు విరుద్ధంగా పరిస్థితి కనబడుతోంది. ఒకటవ తరగతి చదివే విద్యార్థికి సాధారణంగా 16 పుస్తకాలు ఉండాలి. ప్రస్తుతం ఒక్కో విద్యార్థికి 32 నుంచి 34 పుస్తకాలు ఉంటున్నాయి.

తరగతుల వారీగా పుస్తకాలు, బరువు

ఒకటో తరగతికి 14పుస్తకాలు, బరువు 6కిలోలు, 2వ తరగతికి 16పుస్తకాలు, 7కిలోలు, 3వ తరగతికి 18 పుస్తకాలు, 9కిలోలు, 4వ తరగతికి 21పుస్తకాలు, 12కిలోలు, 5వ తరగతికి 25 పుస్తకాలు, 14కిలోలు ఉండాలి. 6వ తరగతికి 28 పుస్తకాలు, 16కిలోలు, 7వ తరగతి 31పుస్తకాలు, బరువు 18కిలోలు, 8,9,10వ తరగతులకు 38పుస్తకాలు 20నుంచి 25కిలోల బరువు నిర్దేశించారు.

ప్రభుత్వం నిర్దేశించిన పుస్తకాలే ఉండాలి



ప్రభుత్వ సిలబస్‌ను కాదని సొంత సిలబస్ పేరుతో విద్యార్థులతో ఇష్టారాజ్యంగా కొనుగోలు చేయించడం నిబంధనలకు విరుద్ధం. పాఠ్య పుస్తకాలు ప్రభుత్వ గుర్తింపు పొందిన విక్రయ దుకాణాల్లో కొనుగోలు చేయాలి. ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు చేపడుతాం. విద్యాసంస్థలు తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చిన పక్షంలో వారు ఫిర్యాదు చేస్తే సదరు పాఠశాలపై చర్యలు తీసుకుంటాం.

–రాధాకృష్ణ, జిల్లా విద్యాధికారి, మెదక్

అధిక పుస్తకాలతో అనర్థాలు



విద్యార్థులు అధిక బరువు మోయడం వల్ల నడుము, వెన్ను, కండరాల నొప్పికి గురవుతారు. మానసిక ఆందోళన పెరుగుతుంది. చదువుపై దృష్టి సారించలేకపోతారు. జీర్ణవ్యవస్థ మందగిస్తుంది. సమయానికి ఆకలి వేయదు. పుస్తకాలను చూడగానే ఆందోళనకు గురవుతారు. పాఠశాలకు వెళ్లే ముందు, వచ్చిన తర్వాత అసహనానికి లోనవుతారు.

–డాక్టర్ అమర్‌సింగ్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్, తూప్రాన్